వేసవిలో పారాహుషార్!

దొంగలతో జాగ్రత్త
- అప్రమత్తతతో చోరీలకు అడ్డు
- ప్రజలకు పోలీసుల సూచనలు

బత్తలపల్లి: వేసవి అంటే కేవలం ఉక్కపోత.. వడదెబ్బే కాదు..దొంగతనాలు కూడా ఉంటాయి. జనం హాయిగా ఆరు బయట నిద్రపోతుంటే.. చోరులు చక్కగా బీరువాలు తెరిచి సొత్తుతో పారిపోతారు. వేసవిలో విహారయాత్రలు, తీర్థ యాత్రలకు, ఊళ్లకు వెళ్లే కుటుంబాలే లక్ష్యంగా దొంగలు చెలరేగుతారు. పోలీసులు కూడా నిత్యం ప్రతి ఇంటినీ గమనించలేరు కదా..! అందుకే ప్రజలు కూడా చైతన్యం కావాలంటున్నారు. అప్రమత్తంగా ఉండి, కింద తెలిపిన జాగ్రత్తలు తీసుకుంటే దొంగల ఆట కట్టించవచ్చని సూచిస్తున్నారు.

- ఇంటి కిటికీలను మూసివేయాలి. వాటికి ఉన్న బోల్టులు సక్రమంగా ఉన్నాయో, లేదో ఎప్పటి కప్పుడు చూసుకోవాలి.
- దుస్తుల్లో డబ్బులు పెట్టి కిటికీలకు, తలుపులకు తగిలించరాదు.
- ఆరు బయట, మిద్దెలపై నిద్రించే వారు అప్రమత్తంగా ఉండాలి. ఇంటికి ఒకటికి రెండు తాళాలు వేసుకోవాలి.


కదిరిలో పట్టపగలే ఇంట్లో దొంగతనం చేసి పారిపోతున్న దొంగ

- బంగారు ఆభరణాలు ధరించి ఆరుబయట నిద్రించకూడదు. ఇంట్లో పడుకున్నా కిటికీలు తెరిచి ఉండే వైపు పడుకోరాదు.
- వీలైతే ఇంటి ఆవరణంలో పెంపుడు కుక్కలను కట్టేయాలి. ఇంట్లో ఎలాంటి శబ్దం, అలికిడి వినిపించినా వెంటనే అప్రమత్తం కావాలి. అలసత్వం ప్రదర్శించరాదు.
- అనుమానాస్పద వాహనాల్లో ప్రయాణించరాదు.
- దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలపాలి.
- రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వస్తే వారి వివరాలు తెలుసుకొని నమోదు చేసుకోవడం మంచిది.
- అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారమివ్వాలి.
- ఇంట్లోని బంగారు నగలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం ఉత్తమం.
- ఎల్లప్పుడు పోలీస్ స్టేషన్ నెంబర్ దగ్గర ఉంచుకోవడం మంచిది.

చోరీల నియంత్రణకు చర్యలు..

వేసవిలో చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టాం. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నాం. ఈ విషయంలో ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు వచ్చే పోలీసుకు సహకరించాలి. పోలీస్ స్టేషన్ నంబర్, వీధుల్లో వచ్చే బీట్ కానిస్టేబుల్ నెంబర్ దగ్గర పెట్టుకోవాలి. పోలీసులకు సహకరిస్తే చోరీలను నియంత్రించడం సులభం. బత్తలపల్లి కూడలిలో రాత్రి 9 గంటలకు దుకాణాలను మూసివేయిస్తున్నాం. ఆ తరువాత కనిపించే వారిని విచారిస్తున్నం.
–టీవీ శ్రీహర్ష, ఎస్ఐ, బత్తలపల్లి

క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం


మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నార్పల పర్యటన పురస్కరించుకుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే, పార్టీ నేతలు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. బుధవారం ఉదయం పార్టీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు కలిశారు.
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పుట్టపర్తిలోని సత్యసాయి విమానాశ్రయంలోని కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కను అందజేసి కృతజ్ఞతలు చెప్పారు. నూతనంగా ఏర్పాటైన శ్రీసత్యసాయి జిల్లా గురించి పలు విషయాలు వివరించారు.

రెండు రోజుల్లో పూర్తి చేయండి

అమడగూరు: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని జేసీఎస్ కన్వీనర్ జయప్ప పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ మండల వ్యాప్తంగా 60 నుంచి 70 శాతం కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో అధిష్టానం ఉత్తర్వుల మేరకు ఈ నెల 29 లోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. కాగా జేకేపల్లి, మహమ్మదాబాద్, అమడగూరు, కసముద్రం, చినగానిపల్లి పంచాయతీల్లో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

రీ సర్వే రైతులకు వరం


రీ సర్వే రాళ్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాఘవేంద్ర


అమడగూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన రీ సర్వే రైతుల పాలిట వరంలా ఉందని ఆర్డీఓ రాఘవేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మండలంలో నిర్వహిస్తున్న రీ సర్వేను పరిశీలించారు. దాదెంవారిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో రీసర్వే పూర్తి కావడంతో 505 ఎకరాలకు హద్దుల ప్రకారం నంబరు రాళ్లను నాటించారు. అలాగే కరిమిరెడ్డిపల్లి, రామనాథపురం, గడిదంవారిపల్లి, ఎస్.కురువపల్లి రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయిందన్నారు. ప్రస్తుతం చీకిరేవులపల్లి గ్రామ పంచాయతీలో రీ సర్వే చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఆర్ఐ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు


తాడిమర్రిలోని సబ్ సెంటర్‌లో టీకాలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లోని సచివాలయాల్లో బుధవారం వైద్య సిబ్బంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు. తాడిమర్రి, పెద్దకోట్ల, నార్సింపల్లి, ఎం.అగ్రహారం, కునుకుంట్ల, దాడితోట, చిల్లవారిపల్లి తదితర గ్రామాల్లో మిడ్‌లెవల్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు చిన్నారులకు పోలియో చుక్కలు, డీపీటీ, నిమోనియా తదితర టీకాలను వేశారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కోమలి, కృష్ణమ్మ, రేష్మా, లక్ష్మీకాంత, సావిత్రమ్మ తదితర ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ముస్లిం బాలురకు ఉచిత ఖత్నా


ఖత్నా చేస్తున్న దృశ్యం

తనకల్లు: మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఉన్న మౌలానా సాహెబ్ ఇంటి వద్ద జామియా ఖాద్రియా ముజఫర్ మదరసా, ఖాద్రీయా ఆస్తానా ఆధ్వర్యంలో బుధవారం ముస్లీం బాలురకు ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖాద్రియా ముజఫర్ కమిటీ సభ్యులు మౌలానా సాహెబ్, మహబూబ్ బాషా మాట్లాడుతూ పేద ముస్లీం బాలురకు నైపుణ్యం కలిగిన వైద్యుల చేత ఖత్నా చేయించినట్లు తెలిపారు. గత పదేళ్లుగా తమ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఖత్నా కార్యక్రమాన్ని చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 30 మంది ఖత్నా చేయించుకున్న వారిని ఒక పంచె, గోధుమ పిండి, బెల్లము, మందులు అందజేశారు. కమిటీ సభ్యులు, పలువురు ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

కదిరి డీఎస్పీగా శ్రీలత

- రేణిగుంటకు డీఎస్పీ భవ్యకిశోర్ బదిలీ


కదిరి నూతన డీఎస్పీ ఎం.శ్రీలత

కదిరి: కదిరి డీఎస్పీగా ఎం.శ్రీలతను నియమించారు. ఈమె రాజమండ్రి సౌత్‌జోన్ డీఎస్పీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. 2018 గ్రూప్–1 బ్యాచ్‌కు చెందిన శ్రీలత స్వస్థలం అన్నమయ్య జిల్లా కోడూరు. డీఎస్పీగా ఎంపికై న తర్వాత మొదటి పోస్టింగ్ ప్రస్తుతం పనిచేస్తున్న రాజమండ్రి సౌత్ కాగా రెండో పోస్టింగ్ ఇప్పుడు కదిరి. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్‌ను తిరుపతి జిల్లా రేణిగుంటకు బదిలీ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త డీఎస్పీ శ్రీలత ఆదివారం కదిరికి విచ్చేయనున్నారు. ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానంతరం సోమవారం కదిరి డీఎస్పీగా బాధ్యతలు చేపతానని ఆమె 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలియజేశారు. 'నేను రాయలసీమ బిడ్డనే..అనంతపురంలోనే డీఎస్పీగా శిక్షణ పొందాను. ఆ ప్రాంత సమస్యలు నాకు కొత్త కాదు. ప్రజలతో మమేకమై విధులను నిజాయతీగా, నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తాను' అన్నారు.

'విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం'

కదిరి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంకధార రాఘవేంద్ర బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నార్పల మండలంలో జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో భాగంగా రూ.912.71 కోట్లు జమ చేశారన్నారు. ఇప్పటివరకు వసతి దీవెన ద్వారా రూ. 4.275.76 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల చదువులకు అండగా నిలుస్తున్నారన్నారు. ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు.

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి

నల్లమాడ: స్థానిక ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో పంట రుణాల రెన్యూవల్ ప్రక్రియ ప్రారంభమైనట్లు మేనేజర్ సుదర్శన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంటరుణాలు కలిగిన రైతులు గత యేడాది రెన్యూవల్ చేసిన తేదీకి రెండు రోజులు ముందుగా బ్యాంక్‌కు రావాలన్నారు. ఒరిజనల్ వన్‌బీ, బ్యాంక్ ఖాతా, భూమి పట్టాదారు పాసుపుస్తకం నకళ్లు తీసుకొచ్చి రెన్యూవల్ చేసుకోవచ్చన్నారు. వడ్డీ చెల్లించేవారు చెల్లించవచ్చని, లేనిపక్షంలో వడ్డీకి సరిపడా మొత్తం పెంచి రుణం రెన్యూవల్ చేస్తామన్నారు. ఏపీజీబీలో పంట రుణం కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో పంట రుణం రెన్యూవల్ చేసుకోవాలని మేనేజర్ కోరారు.

ప్రతిష్టాత్మకంగా సామాజిక సర్వే



మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణమోహన్

తాడిమర్రి: గ్రామాల్లో సామాజిక సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి కృష్ణమోహన్ ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. స్థానిక ప్రధాన ప్రాథమిక (బంగ్లాబడి) పాఠశాలలో బుధవారం సోషియల్ అడిట్‌పై ప్రధానోపాధ్యాయులకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో సామాజిక సర్వేను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీనికి పాఠశాల పేరెంట్స్ కమిటీలు, విద్యార్థుల సహాయ, సహకారాలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు పాఠశాల పేరెంట్స్ కమిటీలు, విద్యార్థుల తల్లితండ్రుల సమావేశాలు నిర్వహించి సామాజిక సర్వేపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రీసోర్స్ పర్సన్స్ ప్రధానోపాధ్యాయులకు సామాజిక సర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగన్‌మోహన్, నాగిరెడ్డి, వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు


రమేష్

హిందూపురం టౌన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి పట్టణంలోని గాయత్రి దేవాలయంలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న రమేష్ అనే యువకుడు ప్రమాదవశాత్తూ కింద పడ్డాడు. తీవ్రంగా గాయాలపాలైన అతడిని స్థానికులు గుర్తించి 108 అంబులెన్సులో హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసుల విచారణలో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఇంటర్ ఫలితాల్లో సత్తా


కదిరి అర్బన్: ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. జీ బాబు సెకండ్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 935 మార్కులు సాధించాడు. లక్ష్మణ్ బైపీసీలో 929 మార్కులు, గణేష్‌నాయక్ సెకండ్ సీఈసీ 904 మార్కులు సాధించారు. ఒకేషనల్ సెకండ్ ఇయర్ ఎంఎల్‌టీ గ్రూపులో కే. ఆవేద్ 936 మార్కులు సాధించగా, ఉర్దూ మీడియంలో అనిషా సుల్తానా సెకండ్ ఎంహెచ్‌సీ 874 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ సీఈసీ గ్రూపులో శేషాద్రికుమార్ 401, భద్ర ఈసీఎల్‌లో 420, అర్షియా ఎంహెచ్‌సీలో 390 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

మెరిసిన కదిరి విద్యార్థి
కదిరి అర్బన్: ఇంటర్ ఫలితాల్లో కదిరి విద్యార్థి సత్తా చాటింది. తిరుపతిలోని నారాయణ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివే కదిరి విద్యార్థి పులగం పల్లి మేఘన ఎంపీసీ విభాగంలో 431 మార్కులు సాధించింది. ఆమెను పలువురు అభినందించారు.

గ్రామీణ విద్యార్థుల ప్రతిభ
ఓడీ చెరువు: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు సత్తాచాటారు. మండల కేంద్రంలోని శ్రీవిజ్ఞాన్ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీలో మారుతి 952 మార్కులు, యమున 938, బైపీసీ ఎస్. షమీరా 889 మార్కులు, ఎం.నెహా 855, షమ్మిన్ 855 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ మస్తాన్ తెలిపారు. స్థానిక ఎస్‌వీబీ జూనియర్ కళాశాలలో చందన ఎంపీసీలో 934 మార్కులు, బైపీసీలో కళ్యాణి 931, సీఈసీలో లోకేష్ 781 మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ ఫక్రుద్దీన్ తెలిపారు.

నిరాశాజకంగా ఇంటర్ ఫలితాలు
తాడిమర్రి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విడుదలైన ఇంటర్ మీడియట్ ఫలితాలు నిరాశాజనకంగా వచ్చాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 29 శాతం ఉత్తీర్ణతతో ఫలితాలు నిరాశపర్చగా, ద్వితీయ సంవత్సరంలో 62 శాతం ఉత్తీర్ణతతో ఫరవాలేదని పించారు. మొదటి సంవత్సరంలో 21 మంది పరీక్షలు రాయగా కేవలం 6 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 37 మందికి 23 మంది ఉత్తీర్ణత సాధించారు. జె.జనార్ధన్ అనే విద్యార్థి (సీఈసీ)లో 807 మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సి.సురేష్‌బాబు తెలిపారు. గురువారం నుంచి మే 6 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు అవకాశం ఉంటుందన్నారు. మే 3 వరకు పరీక్ష ఫీజు చెల్లించ వచ్చునని తెలిపారు. అధ్యాపకుల కొరత వల్లే ఫలితాలు నిరాశాజనకంగా వస్తున్నాయని సిబ్బంది పేర్కొన్నారు.

సీఎంను కలసిన సోమశేఖర్‌రెడ్డి


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సోమశేఖర్ రెడ్డి

పుట్టపర్తి టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి బుధవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఐచర్‌ను ఢీకొన్న బొలెరో

- డ్రైవర్ మృతి


గాయపడిన చాంద్‌బాషా

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల క్రాస్ సమీపంలో బుధవారం రాత్రి ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొంది. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరి నుంచి అనంతపురం వెళ్తున్న బొలెరో వాహనం ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనాన్ని ఢీకొనడంతో బొలెరో డ్రైవర్ చాంద్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తి రైలు ఇంజిన్‌కు ఉన్న విద్యుత్ వైర్‌ను పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. యూపికి చెందిన పవన్ కుమార్ తన భార్య బెంగళూరులో ఉండటంతో ఆమెను కలవడానికి వెళ్లాడు. అయితే ఆమె అతనితో రావడానికి నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన పవన్‌కుమార్ ఎలహంక టూ కాచిగూడ రైల్లో తిరుగు ప్రయాణమయ్యాడు. అయితే గుత్తి రైల్వే స్టేషన్‌లో రైలు ఆగిన సమయంలో ఇంజిన్‌కు ఉన్న విద్యుత్ వైరు పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రమాదంలో పవన్‌కుమార్ శరీరం సుమారు 40 దాకా శాతం కాలిపోయింది. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తదితరులు పవన్‌కుమార్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 27వతేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27వతేదీ నుంచి మే 7 వరకూ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 27న ధ్వజారోహణం, 28న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్ర ప్రభ వాహనంలో స్వామి ఊరేగుతారు. 29న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహ వాహనం, 30న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమద్వాహనం, మే 1న ఉదయం పుష్ప మండపం, సాయంత్రం లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 2న ఉదయం శేష వాహనం, సాయంత్రం గజ వాహనంలో స్వామి ఉత్సవమూర్తులు ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం గరుడోత్సవం నిర్వహిస్తారు. 3న ఉదయం 7గంటలకు మడుగుతేరు (రథోత్సవం) లాగుతారు. అనంతరం సాయంత్రం వరకు స్వామిని దర్శించుకునే అవకాశం కల్పిస్తారు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మ రథోత్సవాన్ని లాగుతారు. సాయంత్రం 6గంటలకు ధూళోత్సవం నిర్వహిస్తారు. 4న సాయంత్రం అశ్వవాహనం, 5న ఉదయం పుష్ప మండపం, 10గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6గంటలకు హంస వాహనంలో స్వామి కొలువుదీరుతారు. 6న సాయంత్రం దేవతా ఉద్వాసన, 7న ఉదయం పుష్పయాగం, సాయంత్రం శయనోత్సవం(ఏకాంత సేవ) నిర్వహించడంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సుప్రియ

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతుకుంట బృందావని కాలనీలో నూతనంగా నిర్మించబోయే చౌడేశ్వరిదేవి ఆలయ నిర్మాణానికి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ రూ.50 వేలు విరాళంగా ఇచ్చినట్లు గ్రామ సర్పంచ్ భర్త అంగజాల రాజు తెలిపారు. కాలనీలో అన్ని వర్గాల వారిని కలుపుకొని ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలని ఆమె సూచించినట్లు రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నులక రామయ్య, ఆదినారాయణరెడ్డి, ప్రభాకర్, లక్ష్మినారాయణ, తలారి వెంకటేష్, శివశంకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటాపురం తండాలో మంగళవారం రాత్రి రెండిళ్లలో చోరీలు జరిగాయి. తండాకు చెందిన లచ్చీరాంనాయక్‌తో పాటు శ్రీనివాస్‌నాయక్ అనే వ్యక్తుల ఇళ్లలో చోరీలు జరిగాయి. బాధితుల కథనం మేరకు... సోమందేపల్లి మండలం గుడిపల్లిలో తమ సోదరి చనిపోవడంతో లచ్చీరాంనాయక్‌తో పాటు కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు వెళ్లారు. శ్రీనివాస్‌నాయక్ కుటుంబ సభ్యులు పాలసముద్రం సమీపంలో జాతర ఉండటంతో వెళ్లారు. దీంతో దుండగులు రాత్రి వాళ్ల ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారు సొమ్ములను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలాలను పరిశీలించారు. పోలీసులు తగిన నిఘా ఉంచకపోవడంతోనే చోరీలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

సోమందేపల్లిలో...
సోమందేపల్లి: మండల కేంద్రంలోని సాయినగర్‌లో నివాసముంటున్న లక్ష్మి నారాయణ ఇంట్లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. వేడి తీవ్రత ఎక్కువగా ఉండటంతో కుటుంబ సభ్యులు మిద్దెపై నిద్రించారు. ఇదే సమయంలో ఇంటి తలుపులు పగల కొట్టి రూ.50 వేల నగదు, రెండున్నర తులాల బంగారం ఎత్తు కెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

బీరు సీసాలతో కొట్టుకున్నారు!



దాడిలో గాయపడ్డ వెంకటేష్, నవీన్‌కుమార్

ధర్మవరం అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు బీరు సీసాలతో కొట్టుకుని గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని ఓ బార్ పక్కన యర్రగుంటకు చెందిన వెంకటేష్ నిలబడి ఉండగా సుందరయ్యనగర్‌కు చెందిన నవీన్‌కుమార్ బీరు సీసాతో దాడి చేశాడు. దీంతో వెంకటేష్ కూడా బీరుసీసా తీసుకుని నవీన్‌కుమార్ తలపై కొట్టాడు. ఇద్దరికి రక్తగాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరినీ విడిపించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న నవీన్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. డబ్బు విషయంగానే ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకున్నట్లు నవీన్‌కుమార్ బంధువులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వైకేపీలో కేటుగాడు

- సీసీ ప్రసాద్ స్వాహా పర్వం
- స్త్రీనిధి, ఉన్నతి రుణాల రికవరీ సొమ్ము దారి మళ్లింపు
- రూ.41 లక్షలకుపైగా సొమ్ము బంధువులు, స్నేహితుల ఖాతాల్లో జమ
- స్త్రీనిధి మేనేజర్ అనిల్ లాగిన్ ద్వారా అప్రూవ్

పుట్టపర్తి: వైకేపీలో స్త్రీ నిధి, ఉన్నతి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రుణాల రికవరీ అయిన మొత్తాన్ని ఓ సీసీ దోపిడీ చేశాడు. జిల్లాలో గ్రామ సంఘాల ఖాతాల నుంచి సొంత ఖాతాలకు మళ్లించి భారీ దోపిడీకి పాల్పడ్డాడు సీసీ ప్రసాద్. గ్రామ సంఘాల లీడర్లను అమాయకులను చేసి ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకొని సీసీ ప్రసాద్ 2017 నుంచి 2019 సెప్టెంబర్ 19వ తేదీ వరకు రూ.3,25,130 బంధువులు, మిత్రుల ఖాతాలకు జమ చేశాడు. బుక్కపట్నం మండలం మారాల క్లస్టర్ భవానీ గ్రామ సంఘం వాపసు కట్టిన డబ్బులు 2021లో రూ.5 లక్షలు వ్యక్తిగత ఖాతాలకు మళ్లించాడు. 2022 మార్చిలో ప్రసాద్ సొంత ఖాతాలోకి జమ చేసుకున్నాడు. మరో రూ.2 లక్షలు గూనిపల్లి బాబావలి ఖాతాకు జమ చేశాడు. దీంతో మొత్తం రూ.41,51,370 సొంత ఖాతాలకు జమ చేసుకొని అవినీతికి పాల్పడ్డాడు. 2017 నుంచి 2022 వరకు ఇతను బుక్కపట్నం మండలం మారాల సీసీగా పనిచేశాడు. ఆ సమయంలోనే సంఘాల నుంచి తీసుకున్న రుణాల రికవరీ సొమ్మును స్త్రీనిధి మేనేజర్ లాగిన్ నుంచి గుట్టు చప్పుడు కాకుండా స్వాహా చేశాడు. ప్రసాద్ గత ఏడాది కొత్తచెరువు మండలం లోచర్ల సీసీగా బదిలీ అయ్యాడు. అక్కడ కూడా ఈ విధంగా లాగిన్ దొంగిలించి డబ్బులు స్వాహాకు పాల్పడేందుకు ప్రయత్నించగా, సిబ్బంది పసిగట్టడంతో గతంలో చేసిన దోపిడీ మొత్తం బయటపడింది.

15 ఖాతాల్లోకి రూ.41.57 లక్షలు జమ
ఎర్రపల్లికి చెందిన పి.లక్ష్మీదేవి ఖాతాలో రూ.1,00,030, కొత్తచెరువులోని జయలక్ష్మీట్రేడర్స్ ఖాతాలో రూ.7,13,000, వెంగళమ్మచెరువు అమర్‌నాథ్ అకౌంట్‌లో రూ.73,000, ఎనుములపల్లికి చెందిన రవిశంకర్ ఖాతాలో రూ.1,42,000, గోకులంకు చెందిన అలివేలమ్మ ఖాతాలో రూ.3,08,180, ఎర్రపల్లికి చెందిన పూజారి అనిల్‌కుమార్ ఖాతాలో ఏకంగా రూ.13,47,500 జమ చేశాడు. అలాగే పైపల్లికి చెందిన ఎల్.భాస్కర్ ఖాతాలో రూ.1,09,000, కొత్తచెరువు శారద అకౌంట్‌లో రూ.1,48,030, రామసాగరానికి చెందిన సి.పద్మావతి ఖాతాలో రూ.1,00,030 జమ చేశాడు. అలాగే బుక్కపట్నంకు చెందిన బండి మల్లికార్జున ఖాతాలో రూ.1,53,000, గూనిపల్లికి చెందిన షేక్‌బాబావలి ఖాతాలో రూ.2,00,000, అనంతపురానికి చెందిన ఆంజనేయులు ఖాతాలో రూ.4,00030, మసూద్‌వలి ఖాతాలో రూ.1,00,006, వీరాంజనేయపల్లికి చెందిన ఈ.పవన్‌కుమార్ ఖాతాలో రూ.63,600 ఇలా మొత్తం 14 మంది ఖాతాల్లోకి డబ్బు మళ్లించాడు. ఇక 91119364785 నంబరుతో ఉన్న తన సొంత అకౌంట్‌కు రూ.2 లక్షలు జమ చేశాడు. ఇలా మొత్తంగా వివిధ ఖాతాల్లోకి రూ.41,57,406 సొమ్మును స్వాహా చేశాడు. 2017 నుంచి 2019 వరకూ ఈత తంగం నడిపించాడు.

స్త్రీనిధి మేనేజర్ లాగిన్ వాడి...
2022 అక్టోబర్ 13, 14వ తేదీల్లో అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 3 గంటల 9 నిమిషాల వరకు కొత్తచెరువు స్త్రీనిధి మేనేజర్ అనిల్‌కుమార్ లాగిన్‌ను సీసీ ప్రసాద్ వినియోగించాడు. ఆ సమయంలోనే తాను దిగమింగిన సొమ్ములకు ఆడిటింగ్ చేసి స్త్రీనిధి మేనేజర్ అప్రూవ్ చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపాడు. ఈ విషయాన్ని విజయవాడ కేంద్ర కార్యాలయానికి సాంకేతిక సంస్థ టీసీఎస్ ధ్రువీకరించింది.

కేసు నమోదు
సీసీ ప్రసాద్ స్వాహా పర్వంపై యానిమేటర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై బుక్కపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డ ప్రసాద్ స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేయించి ఉద్యోగం నుంచి రిమూవ్ చేయటంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పొదుపు మహిళలు పేర్కొంటున్నారు.